క్లుప్తంగా

నేడు నృసింహస్వామి హుండీ లెక్కింపు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపు శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఈవో ఎ.రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిగువ సన్నిధిలోని ఆలయ ముఖ మండపంలో ఎగువ, దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డు వద్ద ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

వటపత్రసాయిగా నారసింహుడు



మంగళగిరి: నగరంలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వటపత్రసాయి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్లచెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.

క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు అందజేత



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన రాయల్ ఫైటర్స్ క్రికెట్ క్రీడాకారులకు దాతలు షేక్.అబ్దుల్ రఫీ, షేక్.నాగుల్ షరీఫ్ శుక్రవారం జెర్సీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.15వేల విలువైన జెర్సీలు అందజేసినట్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో పాల్గొని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అభినందించారు. కార్యక్రమంలో షేక్.పి. ఇమామ్ ఖాజావలి, షేక్. వి.మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

మన అమ్మాయి..మన లావణ్య

- జోరుగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య ప్రచారం
- అపూర్వ ఆదరణతో.. హారతులిచ్చి స్వాగతం పలికిన మహిళలు
- పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు



లావణ్యకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

మంగళగిరి: గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలు పూర్తినమ్మకంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య పేర్కొన్నారు. పట్టణంలోని 10, 11, 12 వార్డుల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు అడుగడుగునా హారుతులిస్తూ.. మహిళలు ఘన స్వాగతం పలికారు. 'మన అమ్మాయి.. మన లావణ్య' అంటూ ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్రచారానికి వెళ్లినా.. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే లావణ్య భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ఆర్కే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు శాసనసభలో ప్రాతినిధ్యం కల్పించి, వారి అభివృద్ధికి కృషి చేసి..రాజకీయ విప్లవానికి సీఎం జగన్ నాంది పలికారని కొనియాడారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి.. పేద, బడుగు, బలహీన వర్గాల ఇంటి వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. వారి వెంట.. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి వెంకట నాగమోహనరావు, పట్టణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు ఎండీ ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, మహిళా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, తాడేపల్లి యూత్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, నాయకులు దామర్ల కుబేరస్వామి, గూండా మధు, దామర్ల నాగయ్య, మురుగుడు సాంబయ్య, చింతక్రింది సాంబశివరావు, కొన్నాదుల బాబూ శివ ప్రసాద్, దుర్గా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే

నేడు 13వ వార్డులో ప్రచారం

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య శనివారం పట్టణంలోని 13వ వార్డు ఇస్లాంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రత్యేక పూజలు..

తాడేపల్లి/మెల్లంపూడి: మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య శుక్రవారం సాయంత్రం మెల్లెంపూడి గ్రామంలోని గంగానమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఫ్యాను గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా నాగయ్య, మెల్లంపూడి గ్రామ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజారామిరెడ్డి, దొంతి రెడ్డి వెంకట శివరామకృష్ణారెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే ఆర్కే వాహనం తనిఖీ



ఎన్నికల నేపథ్యంలో నార్త్ జోన్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసు అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దు అయిన ప్రకాశం బ్యారేజ్, కనకదుర్గ వారధి, బోటుయార్డు, రేవేంద్రపాడు వంతెనతో పాటు కాజ టోల్ గేట్ వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కాజ టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే రోడ్డుపై నుంచుని, పోలీసులకు పూర్తి సహకారం అందించారు. తనిఖీ అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

– మంగళగిరి

కేఎల్‌యూలో ముగిసిన యువజనోత్సవాలు



నృత్యంతో అలరించిన బీఏ ఐఏఎస్ విద్యార్థినులు

తాడేపల్లిరూరల్ : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్న విజ్ఞానాన్ని చదివితే సరిపోదని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలంటే నిబద్ధత, ఆత్మవిశ్వాసం, ఓర్పు, నిర్వహణ సామర్థ్యాలు, సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కేఎల్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీఏ ఐఏఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవాలు (ఆక్రోట్ 24) ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుష్ప్రవర్తనకు, దుష్ప్రచారాలకు దూరంగా మెలగుతూ, ప్రతి విషయంలోనూ సానుకూల దృక్పథాన్ని విద్యార్థులు పెంపొందించుకున్నప్పుడు లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలుగుతారని అన్నారు. బీఏఐఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీ, డిజిటల్ హ్యూమానిటీస్ అనే రెండు కొత్త కోర్సులను ప్రారంభించనున్నామని తెలిపారు. బీఏతో పాటుగా ఎంఏ కోర్సులు ఐఏఎస్ ఓరియన్‌టేషన్‌తో నిర్వహించనున్నామన్నారు. సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేఎల్‌యూతో పాటు వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ సాహిత్య సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, స్పాట్ ఈవెంట్స్, శాస్త్రీయ, పాశ్చాత్య, లలిత సంగీతాలు, మిస్టర్ అండ్ మిసెస్ తదితర 14 అంశాల్లో పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆచార్యులు డాక్టర్ కె.తాతారావు, విభాగ ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్‌కుమార్, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ బాలాజీ మానసారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికుమార్, విద్యార్థి కో-ఆర్డినేటర్లు స్వామి, అశోక్ పాల్గొన్నారు.

నేడు తుళ్లూరులో ఆర్వో సమీక్ష సమావేశం

తాడికొండ: తుళ్లూరులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సమీక్ష సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.శివన్నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు సాయి బాబా కల్యాణ మండపంలో సమావేశానికి ప్రారంభమవుతుందని మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య సమీక్ష

తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో వేసవి నీటి ఎద్దడి నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తుళ్లూరు ఎంపీడీవో బి.శివన్నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామీణ నీటి సరఫరా ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గతేడాది, ప్రస్తుత యాక్షన్ ప్లాన్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

తాడికొండ: క్రీస్తు శిలువ మరణం పొందిన రోజు గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) సందర్భంగా తాడికొండ, తుళ్లూరు మండలాల్లో భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో క్రీస్తు శిలువ వేసిన సందర్భంలో పలికిన ఏడు మాటలను చర్చిల్లో ధ్యానం రూపంలో వివరించారు. నిడుముక్కల ఆర్‌సీఎం చర్చితో పాటు పలు చర్చిల్లో క్రీస్తు శిలువ మార్గం సన్నివేశాన్ని భక్తులు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా భక్తులు ఆలయాల్లో కన్నీటి ప్రార్థనలు నిర్వహించారు.



వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ జాకబ్



నిడుముక్కలలో క్రీస్తు శిలువ మార్గం

ఏసుక్రీస్తు శిలువ మార్గం ప్రదర్శన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్, రూరల్, దుగ్గిరాల మండలంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు పలు చర్చిల్లో శుక్రవారం నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ మోస్తూ ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. తాడేపల్లి ముగ్గురోడ్డులో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి ముగ్గు రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. 1వ వార్డులో ఉన్న ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువను ఏర్పాటు చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్టియన్‌పేట, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని చిలువూరులో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు, సంఘ పెద్దలు వాక్యోపదేశం చేశారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు

ఫిరంగిపురం: కరుణామయుడు ఏసుక్రీస్తు అని విచారణ గురువు పి.బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో మంచి శుక్రవారం(గుడ్ ఫ్రైడే)ను నిర్వహించారు. విచారణ గురువు పి.బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ క్రీస్తును యూదులకు అప్పగించిన విధానం, పిలాతు ఏసుక్రీస్తునకు మరణ శిక్ష విధించుట గురించి, క్రీస్తు శిలువను భుజంపై మోసుకెళ్లే సందర్భం, శిలువపై క్రీస్తు మరణించడం గురించి వివరించారు. సాంగ్యాలు ఆలపించారు. అనంతరం శిలువను భక్తులకు అందుబాటులో ఉంచడంతో వారు భక్తితో ముద్దాడారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్, డీకెన్ బాల, కతోలిక క్రైస్తవులు, మఠకన్యలు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

బడేపురం(తాడికొండ): గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని తాడికొండ శివారు బడేపురం గ్రామంలో మహిళలకు వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండలాధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్ చీరలు పంపిణీ చేశారు. క్రీస్తు శిలువతో మరణించిన శుభ శుక్రవారం సందర్భంగా మహిళలకు తనవంతు సాయం అందించినట్లు చెప్పారు.



క్రీస్తు శిలువ మరణం ప్రదర్శన



ఏసు ప్రభువు వేషధారణలో శిలువను మోస్తూ..



ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్



శిలువను తీసుకొస్తున్న గురువు బాలస్వామి

70ఏళ్ల వివాదం.. మూడేళ్లలో పరిష్కారం

- పద్మశాలీ బహూత్తమ సంఘానికి దక్కిన నాంచారమ్మ చెరువు స్థలం
- ఎమ్మెల్యేగా వివాదాలను పరిష్కరించడంలో కృషి చేసిన ఆర్కే
- చరిత్రలో నిలిచిపోయేలా భావనారుషి ఆలయ నిర్మాణం



నాంచారమ్మ చెరువులో నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయం



భద్రావతి సమేత భావనారుషి స్వామివార్లు

మంగళగిరి: పట్టణ నడిబొడ్డున నాంచారమ్మ చెరువు ఉంది. 1954 సంవత్సరానికి ముందే దామర్ల నాంచారమ్మ తన పొలంలో సుమారు ఏడు ఎకరాలను పట్టణ పద్మశాలీయ సంఘానికి దానం చేసింది. నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో నాంచారమ్మ ఇచ్చిన పొలాన్ని చెరువుగా మార్చారు. నీటిని నిల్వ ఉంచి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చారు. దీంతో నాంచారమ్మ చెరువుగా ప్రసిద్ధి చెందగా.. పట్టణం విస్తరణతో ఈ చెరువు ఆక్రమణకు గురైంది. ఆక్రమణలు పోనూ సుమారు నాలుగు ఎకరాలు మాత్రం మిగిలింది. ఈ ఆక్రమణలను అడ్డుకునేందుకు అప్పారు మైలార్ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడిగా ఉన్న 1980లో చెరువు చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయినా, కొందరు ఇది ప్రభుత్వ భూమి అంటూ కోర్టులను ఆశ్రయించడంతో వివాదాస్పదంగా మారింది. గత 70 ఏళ్లుగా చెరువు స్థలం వివాదం కోర్టులో నలుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నాంచారమ్మ చెరువు సమస్య పరిష్కారానికి కృషి చేశారు. చెరువు చరిత్రతో పాటు మున్సిపాలిటీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఇది పద్మశాలీయ బహూత్తమ సంఘానికి చెందిందని గుర్తించారు. కోర్టులో వివాదం పరిష్కరించే విధంగా పోరాడారు. కోర్టులో సమస్య పరిష్కారం కావడంతో సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి చెరువు స్థలాన్ని పద్మశాలీయ బహూత్తమ సంఘానికి దక్కేలా చర్యలు తీసుకున్నారు. సంఘానికి స్థలం చెందడంతో వెంటనే అందులో.. భద్రావతి సమేత భావనారుషి స్వామి, గణపతి, లక్ష్మీదేవి, సరస్వతీ ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, పూర్తి చేశారు. దీంతో పద్మశాలీయులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల వివాదాన్ని పరిష్కరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

వివాదాలు పరిష్కరించి..



దామర్ల నాంచారమ్మ సహృదయంతో ఏడెకరాల భూమిని దానం చేసింది. అప్పట్లో తాగునీటి సమస్య రాకుండా భూమిని చెరువుగా మార్చారు. కాలక్రమేణ ఆక్రమణకు గురై.. నాలుగు ఎకరాలు మిగిలింది. గత 70 ఏళ్లుగా భూమి వృధాగా ఉంది. వివాదాలు పరిష్కరించి, స్థలం సంఘానికి దక్కేలా చర్యలు తీసుకోవడం జరిగింది. అక్కడ భావనా రుషి స్వామి ఆలయం నిర్మాణం, స్థలం చుట్టూ ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నారు.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే, మంగళగిరి

అసలు ఊహించలేదు..



దామర్ల నాంచారమ్మ చెరువు వివాదం పరిష్కారం అవుతుందని ఊహించలేదు. అన్ని వివాదాలను పరిష్కరించి సంఘానికి స్థలం దక్కేలా చేయడంతో ఎమ్మెల్యే ఆర్కే చేసిన కృషి పద్మశాలీయులు ఎవరు మరువరు. సుమారు రూ.2 కోట్లు వెచ్చించి ఆలయాల నిర్మాణం చేపట్టాం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మికను, ఆరోగ్యాన్ని అందించేలా అభివృద్ధి చేస్తున్నాం.

– డి.కుబేరస్వామి, ప్రధాన కార్యదర్శి, పద్మశాలీయ బహూత్తమ సంఘం.

యువకుడు ఆత్మహత్య


కొల్లిపర: బాకీదారులు డబ్బులు అడగడంతో పాటు దౌర్జన్యం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపరకి చెందిన అయోధ్య శివరామకృష్ణ (28) అదే గ్రామానికి చెందిన లింగాల శివరామకృష్ణ, కొల్లిపర శేషులకు బాకీ ఉన్నాడు. దీంతో ఇద్దరు డబ్బులు అడగటంతో పాటు కలసి కొట్టడంతో అయోధ్య శివరామకృష్ణ మనస్తాపానికి గురయ్యాడు. దీంతో గురువారం రాత్రి తన గృహంలో రాటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు తలుపు తీయగా శివరామకృష్ణ ఉరివేసుకుని కనిపించటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివరామకృష్ణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రచారం వాహనంపై దాడి

- ఫ్లెక్సీలు చించివేత
- చిందులు తొక్కిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డ్రైవర్
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఫ్లెక్సీని చించివేసిన వాహనం



నారా లోకేష్, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో తాటి అవినాష్

మంగళగిరి :మంగళగిరిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అరాచకానికి పాల్పడుతున్నారు. శుక్రవారం రాత్రి తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ కాలనీలో ప్రచారం ముగించుకుని మంగళగిరి వస్తున్న వాహనాన్ని జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద టీడీపీ కార్యకర్త తాటి అవినాష్, అతని స్నేహితులు మరో ఇద్దరు అపారు. వాహనంపై ఉన్న ఫ్లెక్సీలు చించివేయడంతోపాటు డ్రైవర్ భానుపై దాడికి తెగబడ్డారు. స్థానికుల సహకారంతో తప్పించుకున్న డ్రైవర్ భాను వాహనం తీసుకుని నేరుగా మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఓ బార్‌లో మందు తాగుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని ముగ్గురు నిందితులను స్టేషన్‌కు తరలించారు.